క్లుప్తంగా

విద్యార్థినులకు నగదు పురస్కారం



విద్యార్థినులకు నగదు అందజేస్తున్న జీవీ సుబ్బారెడ్డి

కోవెలకుంట్ల: పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు గురువారం నగదు పురస్కారం అందజేశారు. హర్షిత 587 మార్కులు, శివమహిజ 570 మార్కులు సాధించగా ఆ పాఠశాల రిటైర్డ్ హెచ్ఎం జీవీ సుబ్బారెడ్డి ఒక్కో విద్యార్థినికి రూ. 5వేల చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

సగటు వేతనం పడేలా పనులు చేసుకోవాలి



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ రామచంద్రారెడ్డి

బేతంచెర్ల: ఉపాధి కూలీలు రోజుకు రూ. 272 పడేలా పనిచేసుకోవాలని ప్రాజెక్టు డైరెక్టర్ రామ చంద్రారెడ్డి సూచించారు. మండల పరిధిలోని రంగాపురం కుంటలో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం పీడీ పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో కూలీలు అప్రమత్తంగా ఉండాలని, ఉదయం త్వరగా వచ్చి పనులు చేసుకోవాలని సూచించారు. జాబు కార్డు ఉన్న ప్రతి కుటుంబం 100 రోజుల పూర్తి చేయాలని, ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ శేషన్న, ఈసీ సుబ్బానాయక్, టీఏ మోహన్, ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రకళ పాల్గొన్నారు.

హనుమజ్జయంతి విజయవంతం చేయాలి

బనగానపల్లెరూరల్: బనగానపల్లె పట్టణంలోని ఆంజనేయస్వామిదేవస్థానంలో ఈ నెల 14న తిరుమల తిరుపతిదేవస్థానం, హిందూధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాల శాఖ ఆధ్వర్యంలో హనుమజ్జయంతి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లువెంకట రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి నిర్వాహణపై విశ్వహిందూ పరిషత్, ధర్మ ప్రచార మండలి సభ్యులు, సమరసతల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మల్లు వెంకటరెడ్డి మాట్లాడారు. హనుమజ్జయంతి పూజా కార్యక్రమానికి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదం స్వీకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ధర్మప్రచార మండలి సభ్యులు డాక్టర్ గాథంశెట్టి రవికుమార్, విశ్వహిందూ పరిషత్ ప్రఖండ కార్యదర్శి జి ఓబులరెడ్డి, జిల్లా సహకార్యదర్శి కిశోర్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గాథంశెట్టి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బేతంచెర్ల: మండలంలోని గోరుమానుకొండ ఆదర్శ స్కూల్‌లో 2023–24 సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ షమీల తెలిపారు. ఈనెల 25లోపు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు జూన్ 11న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్ష 5వ తరగతి స్థాయిలో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో నిర్వహిస్తామన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీలు రూ.75 చెల్లించి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రజా సేవతో సంతృప్తి



డాక్టర్ విజయభాస్కర్, డాక్టర్ శిరీష దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

డోన్ : ప్రజలకు నిజాయతీగా సేవలందిస్తే అంతులేని ఆత్మసంతృప్తి కలుగుతుందని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. చిన్నమల్కాపురం పీహెచ్‌సీ నుంచి హైదరాబాదు ఉస్మానియా ఆసుపత్రికి ఆర్ఎంఓగా బదిలీ అయిన డాక్టర్ విజయభాస్కర్, ఆయన సతీమణి, గాంధీ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ శిరీషను గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఘనంగా సత్కరించారు. ఎంపీపీతోపాటు బేతంచెర్ల, డోన్ తహసీల్దార్‌లు నరేంద్రనాథ్‌రెడ్డి, విద్యాసాగర్, వ్యవసాయ శాఖ ఏడీఏ అశోక్‌వర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, ఎంపీడీఓ శ్రీనివాసులు తదితరులు డాక్టర్ దంపతులకు శాలువాలు కప్పి పూలలతో సత్కరించారు. డాక్టర్ విజయభాస్కర్ ప్రజలకు అందజేసిన సేవలను ఈ సందర్భంగా ఎంపీపీ గుర్తు చేశారు.



పట్టాలు దాటుకుంటూ వెళ్తున్న ప్రయాణికులు,



రైలు దగ్గరికి వెళ్లేందుకు ఓ వృద్ధుడి అగచాట్లు....

ఎన్నాళ్లీ తిప్పలు!

డోన్ టౌన్: రైల్వే జంక్షన్ డోన్‌లో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రత్యేకించి డోన్ నుంచి గుంటూరుకు ట్రైన్ ఎక్కాలంటే అష్టకష్టాలు పడాల్సిందే. స్టేషన్‌లో మూడు ప్లాట్‌ఫామ్‌లు ఉండగా మరో రెండింటిని ఏర్పాటు చేస్తున్నారు. అదనంగా చేపట్టిన 4,5 ప్లాట్ ఫామ్‌ల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. అయితే ఉదయం డోన్ నుంచి గుంటూరు వెళ్లే ప్యాసింజరు ట్రైన్‌ను నాల్గవ ప్లాట్‌ఫామ్‌లో ఉంచడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంటూరు నుంచి రాత్రి వచ్చిన ట్రైన్‌ను నాల్గవ ప్లాట్ ఫారమ్‌లో ఉంచుతున్నారు. ఉదయం ఇతర ప్లాట్‌ఫారమ్‌లు ఖాళీగా ఉన్నప్పటికీ పాసింజర్ రైలును ఉంచడం లేదు. నాల్గవ ప్లాట్ ఫామ్‌కు వెళ్లాలంటే మధ్యలో రైలు పట్టాలు దాటాల్సి ఉంది. ఒక్కోసారి గూడ్స్‌ట్రైన్ కూడా మధ్య పట్టాలపై నిలిచి ఉంటుంది. ఫ్లై ఓవర్ బ్రిడ్జిని ఎక్కాలంటే వృద్ధులు, వికలాంగులు, చిన్న పిల్లలు, లగేజీతో సాధ్యం కావడం లేదు. దీంతో పడరానిపాట్లు పడుతూ అక్కడికి చేరుకుంటున్నారు ప్రయాణికులు. వృద్ధులు, పిల్లలు కిందపడిన సంఘటనలూ లేకపోలేదు. ట్రైన్ టైమ్ చివరిలో వచ్చేవారి పరిస్థితి దారుణం. దాదాపు రెండ నెలలుగా ఇబ్బందులు పడుతున్నామని... ఎన్నాళ్లీ తిప్పలు అంటూ ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి అనుకూలమైన ప్లాట్‌ఫామ్‌లో గుంటూరు ప్యాసింజర్ ట్రైన్‌ను నిలుపాలని ప్రయాణికులు కోరుతున్నారు. స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లును సెల్‌లో సంప్రదించగా స్పందించలేదు. సమస్యను చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ వీరేంద్ర దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. ఫ్లైఓవర్ మీదనే వెళ్లేలా అలవాటు చేసేందుకే ఇలా ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణికులు ఇబ్బందిపై ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని, అయినా విషయాన్ని డీఆర్ఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార చర్యలు చేపడుతామన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్‌లు అందజేసిన ఎమ్మెల్యే కాటసాని



వీల్‌చైర్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, కాటసానిఓబులరెడ్డి

బనగానపల్లె: ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పెద్దకుమారుడు దివంగత కాటసాని నాగార్జునరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం దివ్యాంగులకు వీల్ చైర్‌లు పంపిణీ చేశారు. స్థానిక బీసీ కాలనీకి చెందిన యువకుల విన్నపం మేరకు స్పందించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, తనయుడు కాటసాని ఓబులరెడ్డి దివ్యాంగులకు వీల్ చైర్‌లు అందజేశారు. దివ్యాంగులతోపాటు కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, యువకులు ఫైరోజ్, అత్తార్ అఖిల్, కరీం, షికిందర్, అబ్దుల్లా, సయ్యద్, అసిఫ్, మాబాషా సోయబ్, తాహీర్ తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి ఇంటర్ అడ్మిషన్‌లు

కొలిమిగుండ్ల: 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 15 వ తేదీ నుంచి ఇంటర్ అడ్మిషన్‌లు ప్రారంభం అవుతాయని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు గురువారం తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయన్నారు. ఈవిద్యా సంవత్సరం నుంచే కొత్తగా ఇంగ్లిష్ మీడియం సైన్స్ గ్రూపులతో ప్రారంభిస్తున్నామన్నారు. జూన్ 1వ తేది నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని చెప్పారు.

నాటుసారా స్వాధీనం

అవుకు: మండల పరిధిలోని వేములపాడు సమీపంలోని సోలార్‌ప్లాంట్ వద్ద గురువారం 180 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ సుబాషిణి తెలిపారు. రాళ్లకొత్తూరుకు చెందిన అమర్‌నాయక్, గడ్డమేకలపల్లెకు చెందిన పెద్దన్న బైక్‌పై సారా తీసుకెళ్తుండగా దాడి చేశామన్నారు. బైక్ నడుపుతున్న అమర్‌నాయక్ పట్టుబడగా, పెద్దన్న పరారయ్యాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి అమర్‌నాయక్‌ను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపర్చామన్నారు.

సత్తా చాటిన కొత్తూరు వృషభాలు



రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఏపీ ఐడీసీ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలను ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్ధన్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కర్రా తేజారెడ్డి, సహదేవరెడ్డి హాజరయ్యారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో పాణ్యం మండలం కొత్తూరుకు చెందిన బీరం సుబ్రమణేశ్వర రెడ్డి వృషభాలు నిర్ణీత సమయంలో 4,200 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతి రూ. 50వేలను కైవసం చేసుకున్నాయి. ఇదే యజమానికి చెందిన రెండవ జత వృషభాలు 3,754 అడుగులు, బాపట్ల జిల్లా వేటపాలెం శివకృష్ణ చౌదరి వృషభాలు 3,715 అడుగులతో రెండు, మూడు స్థానాల్లో రూ. 40వేలు, రూ. 30 వేలు దక్కించుకున్నాయి. వైఎస్సార్ జిల్లా ఖాదర్‌ఖాన్ కొట్టాలకు చెందిన భవనశ్రీ వృషభాలు 3,328 అడుగులు, బనగానపల్లె మండలం పాతపాడుకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి వృషభాలు 3,300 అడుగుల దూరం లాగి తర్వాతి వరుస స్థానాల్లో రూ. 20వేలు, రూ. 10 వేలు గెలుపొందాయి. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, తిరుణాల కమిటీ, జైజవాన్, జైకిషాన్ ప్రింటింగ్, దామోదరాచారి, షేక్‌ఉసేన్‌వలి, ఆనం వెంకట మధుసూదన్‌రెడ్డి ఆర్థిక సహకారంతో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

సత్రాన్ని కూల్చడం బాధాకరం

మహానంది: ఏడు దశాబ్దాల చరిత్ర కలిగిన మహానందిలోని భూదేవయ్య వీరశైవ అన్నసత్ర మండపాన్ని కూల్చడం బాధాకరమని వీరశైవ సంఘం ప్రతినిధులు శంకరయ్య, శ్రీనివాసులు, తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. మహానందిలోని వీరశైవ అన్నసత్రాన్ని కూల్చడంతో గురువారం వారు మహానందికి చేరుకొని పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. 1952లో కర్ణాటక రాష్ట్రానికి చెందిన భూదేవయ్య అనే భక్తుడు వీరశైవుల కోసం మండపాన్ని నిర్మించారని చెప్పారు. ప్రతి ఏడాది శివరాత్రి, కార్తిక మాసం ఉత్సవాలకు అన్నదానం నిర్వహించేవారమన్నారు. ఈ విషయంపై ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా తొలగించామని, అది దేవస్థానానికి చెందిన స్థలమని చెప్పారు.

మారని తీరు!

శ్రీశైలం: శ్రీశైలమహాక్షేత్రానికి ప్రతి ఆర్టీసీ బస్సు తప్పనిసరిగా సున్నిపెంటకు వెళ్లి అక్కడ ప్రయాణికులను దించి రావాల్సిందే. గతంలో తిరుపతి– శ్రీశైలం ప్రతి సర్వీస్ వెళ్లకపోవడంపై మార్కాపురం డిపో మేనేజర్‌కు ఫిర్యాదులు అందాయి. దీనిపై స్పందించిన డిపో మేనేజర్ 141 కార్డు ప్రకారం సర్వీసులన్నీ సున్నిపెంటకు వెళ్లాల్సిందేనని సర్కులర్ జారీ చేశారు. మూడు రోజుల క్రితం ఆత్మకూరు, కర్నూలు డిపో మేనేజర్లు కూడా శ్రీశైలానికి వెళ్లే ప్రతిబస్సు సున్నిపెంట బస్టాండ్‌కు పోయిరావాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ పలు బస్సులు సున్నిపెంటలోకి వెళ్లడంలేదు. గురువారం తిరుపతి నుంచి వస్తున్న ఏపీ16జెడ్ విజయవాడ డిపోకు చెందిన బస్సు మధ్యాహ్నం 3 గంటల సమయంలో సున్నిపెంటకు వెళ్లే ప్రయాణికురాలు ఒక్కరే ఉన్నారని సున్నిపెంట వెళ్లే ముఖద్వారం వద్ద ఆమెను దించేసి మచిలీపట్నం నుంచి వస్తున్న బస్సు సున్నిపెంటకు వెళ్తుండడంతో అందులో ఎక్కించారు. నిబంధనలు ఉల్లంఘించడంతో పాటు సదరు ప్రయాణికురాలి నుంచి శ్రీశైలం వరకు బస్సుచార్జీలను వసూలు చేసినట్లు ఆమె వాపోయింది.

రక్త హీనత నివారణకు చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల్లో రక్తహీనత ఉన్న వారిని గుర్తించి హిమోగ్లోబిన్ శాతం పెంచేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కె.ఎస్. జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లకు సూచించారు. గురువారం వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, నాడు–నేడు, జగనన్న విద్యా కానుక కిట్లు, స్పందన అర్జీల పరిష్కారం, గ్రామ వార్డు సచివాలయాలు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ ఛాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జాయింట్ కలెక్టర్ నిశాంతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ నాడు–నేడు కింద జిల్లాలో ఇంకా ప్రారంభం కాని 7 అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత అడ్మిషన్ల భర్తీ నిమిత్తం పాఠశాల విద్యాశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రతి పాఠశాలలో మౌలిక వసతులు విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే పూర్తి కావాలని చెప్పారు. పాఠశాలలు తెరిచిన వెంటనే జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేయాలని తెలిపారు.

నాసిరకం విత్తనాలు అమ్మితే చర్యలు



విత్తన దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ కృష్ణమోహన్ రెడ్డి

ఆళ్లగడ్డ: నకిలీ, నాసిరకం విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఇంటర్నల్ స్క్వాడ్ అధికారి, కోవెలకుంట్ల ఏడీఏ కృష్ణమోహన్‌రెడ్డి హెచ్చరించారు. ఇంటర్నల్ స్క్వాడ్ ఆన్ సీడ్స్‌లో భాగంగా గురువారం పట్టణంలోని పలు విత్తన దుఖాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు అమ్మిన విత్తనాలకు సంబంధించి తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని సూచించారు. అధీకృత కంపెనీలకు చెందిన విత్తనాలను నిర్ణయించిన ధరలకు మాత్రమే విక్రయించాలని చెప్పారు. ఏఓ కిశోర్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

కమనీయం.. పాండురంగడి చక్రస్నానం



స్వామివారి చక్రస్నాన కార్యక్రమాన్ని తిలకిస్తున్న భక్తులు

- తిలకించేందుకు వేలాదిగా తరలి వచ్చిన భక్తులు
- నాకబలితో ముగిసిన బ్రహ్మోత్సవాలు



శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగడి గ్రామోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో గురువారం వసంతోత్సవం, స్వామివారి చక్రస్నాన కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యులు పాండురంగడికి పంచామృతాభిషేకం, స్త్రీసూక్త, భూసూక్త విధానేన అభిషేకాలు తదితర పూజా కార్యక్రమాలు జరిపారు. అనంతరం స్వామివారి వసంతోత్సవాన్ని నిర్వహించి భక్తులు రంగులు చల్లుకున్నారు. వేసవికాలంలో వైశాఖ మాసాన్ని పురస్కరించుని 11 రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో కల్యాణం, వాహన సేవలు, రథోత్సవ కార్యక్రమాల్లో స్వామివారి వేడిని చల్లార్చేందుకు, ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని కోనేటిలో చేపట్టిన చక్రస్నాన కార్యక్రమం కమనీయంగా కొనసాగింది. రాత్రి ధ్వజారోహణ, కంకణ నిమజ్జనం, నాకబలితో గత నెల 30వ తేదీన ప్రారంభమైన పాండురంగడి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. చివరిరోజు నిర్వహించిన కార్యక్రమాలను తిలకించేందుకు పట్టణంతోపాటు చుక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో కోనేటి ప్రాంగణం జనసంద్రమైంది.

ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో నాగుపాము



నాగు పామును పట్టుకుంటున్న నాగరాజు

బేతంచెర్ల: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో గురువారం సాయంత్రం నాగుపాము కలకం సృష్టించింది. దీంతో ఉద్యోగులు, ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఆవరణలోని సిమెంట్ రోడ్డు కింద ఉన్న కప్పల కోసం వచ్చిన నాగుపామును గుర్తించిన కార్యాలయం సిబ్బంది గుర్తించి పాములుపట్టే హనుమాన్ నగర్ కాలనీకి చెందిన రాజుకుమార్‌కు సమాచారం ఇచ్చారు. అతడు పామును చాక చక్యంగా పట్టుకొని డబ్బాలో బంధించి, దూరంగా తీసుకెళ్లి వదిలి వేశాడు.

సచివాలయ వ్యవస్థతో ప్రజల ముంగిటే పాలన

- సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత
- సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి
- ప్రభుత్వ భవనాలతో పల్లెలకు పట్టణ శోభ
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



రూ. 20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా గ్రామస్థాయిలో పరిపాలన వికేంద్రీకరణ చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ముగింటకే సేవలను అందుబాటులోకి తెచ్చారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. మండలంలోని గుళ్లదూర్తి గ్రామంలో రూ. 35 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ. 21.80 లక్షలతో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల నూతన భవనాలతోపాటు వివిధ కాలనీల్లో రూ. 30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేతోపాటు ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్ పర్సన్ కర్రా గిరిజ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణ రెడ్డి, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పేరా నాగార్జున రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కరుణాకర్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, న్యాయ విభాగ జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, పార్టీ మండల ఇన్‌చార్జ్ భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్‌లు ఎల్వీ సుధాకర్‌రెడ్డి, లోకేశ్వరరెడ్డి, మోహన్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, బాలమద్దిలేటి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారన్నారు.

సంక్షేమంతో సరికొత్త అధ్యాయం

ప్రజల అభ్యున్నతికి వివిధ సంక్షే పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికిందని ఎమ్మెల్యే కాటసాని తెలిపారు. అమ్మఒడి, వైఎస్సార్ పింఛన్ కానుక, వైఎస్సార్ చేయూత, ఆసరా, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన తదితర బృహత్తర పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్‌వ్యవస్థ ద్వారా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డితో సాధ్యమైందన్నారు. 2014 ఎన్నికల్లో అధికారం కోసం హామీలిచ్చి వాటిలో ఏ ఒక్కటి నెరవేర్చని పచ్చి మోసగాడు చంద్రబాబు అని మండి పడ్డారు. రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణాలు మాఫీ, రూ. 2కే 20 లీటర్ల తాగునీరు, నిరుద్యోగులకు ఉద్యోగాలని, లేనోళ్లకు నిరుద్యోగ భృతి, విద్యార్థులకు కంప్యూటర్లని, 600కు పైగా హామీలిచ్చిన చంద్రబాలు అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో మోసగాళ్లు మళ్లీ గ్రామాల్లోని వస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో టీడీపీకి మరోసారి గుణపాఠం చెప్పాలని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, తహసీల్దార్ పుష్పకుమారి, మండల వ్యవసాయధికారి నిరంజన్, ఈఓపీఆర్‌డీ రాధిక, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు రుషికేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మూర్తిరెడ్డి, సుబ్బారెడ్డి, వివేకానందరెడ్డి, కృష్ణారెడ్డి, సతీష్, శ్రీనివాసులు, మండల నాయకులు శ్రీనివాసరెడ్డి, వీరారెడ్డి, మధుసూదన్ రెడ్డి, పోతం రాంమోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాగభూషణంరెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మూడు గంటలు ఆలస్యంగా డెమూ ట్రైన్

డోన్ టౌన్: కర్నూలు నుంచి గుంతకల్లుకు వెళ్లే డెమూ ట్రైన్ గురువారం మూడు గంటలు ఆలస్యంగా నడిచింది. డోన్ సమీపంలోని బోగోలు రైల్వే స్టేషన్ వద్ద జరుగుతున్న డబుల్ లైన్ అభివృద్ధి పనుల కారణంగా డెమె ట్రైన్‌ను అక్కడే నిలిపి వేశారు. డోన్‌కు ఉదయం 10.45గంటలకు రావాల్సిన రైలు మధ్యాహ్నం 1.45 గంటలకు వచ్చింది. తీవ్ర ఇబ్బందులు పడ్డామని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. డోన్ ప్రయాణికులు మాత్రం వారి కుటుంబ సభ్యులకు, బంధువులకు, స్నేహితులకు సమాచారం ఇచ్చి బైకులను బోగోలు రైల్వే స్టేషన్‌కు రప్పించుకుని పట్టణానికి చేరుకున్నారు.

కాల్వలో పడిన ఆటో

డోన్ టౌన్: పట్టణంలోని ఆటో నగర్ నుంచి శ్రీనివాస థియేటర్ రోడ్డుకు వస్తున్న ఆటో అదుపు తప్పి మురిగు కాలువలో గురువారం పడింది. ఈ రహదారిలో గృహాలు నిర్మించుకున్న వారు రోడ్డును కబ్జా చేసినందు వల్లే ఈలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటు ఉన్నాయని కొందరు వాపోయారు. అధికారులు స్పందించి ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు కోరారు.

కోలుకోలేక మహిళ మృతి

బేతంచెర్ల: పెండరంగు తాగి ఆత్మహత్యకు పాల్పడిన మండల పరిధిలోని గోర్లగుట్టకు చెందిన బీరవోలు లక్ష్మిదేవి (33) చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందింది. హెడ్ కానిస్టేబుల్ ఎంవీ రమణ వివరాల మేరకు బీరవోలు లక్ష్మిదేవి భర్త శంకర్ తాగుడుకు భానిసయ్యాడు. దీంతో తరచూ గొడవపడుతుండటంతో ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఈనెల 9వ తేదీన లక్ష్మిదేవి పెండరంగు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆమెను కర్నూలు కు తరలించారు. మృతురాలి తల్లి తులసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

రహదారి విస్తరణ పనుల పరిశీలన



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ ఏఈ మధు

ప్యాపిలి: మండల కేంద్రం ప్యాపిలిలో జరుగుతున్న రహదారి విస్తరణ పనులను ఆర్అండ్‌బీ ఏఈ మధు గురువారం పరిశీలించారు. రూ. 16 కోట్లతో రహదారి విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పనుల్లో నాణ్యత ప్రమాణాలు తగ్గకుండా చర్యలు తీసుకుంటున్నామని ఏఈ తెలిపారు. అనంతరం ఆయన ఆర్అండ్‌బీ అతిథి గృహ మరమ్మతు పనులను పరిశీలించారు. అదేవిధంగా అతిథి గృహం ఆవరణలో నూతనంగా నిర్మించనున్న పార్కుకు సంబంధించిన స్థలాన్ని చదును చేసే పనులను పరిశీలించారు.

వృత్తివిద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు



సర్టిఫికెట్ అందజేస్తున్న చైర్మన్ రాజేష్, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు

డోన్ : ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా యువత సాంకేతిక విద్య ద్వారా ఉపాధి పొందేందుకు ప్రయత్నించాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో గురువారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు ప్రతాప్‌రెడ్డి, ఐటీఐ ప్రిన్సిపాల్ రాయపురెడ్డి అధ్యక్షతన శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ఐటీఐలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో ఎలక్ట్రిషియన్, డొమెస్టిక్ సొల్యూషన్, ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్ కోర్సులలో మూడు నెలల శిక్షణ ఇచ్చామన్నారు. ఈ మేరకు వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేయడంతోపాటు 60 మందికి వివిధ సంస్థలలో ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో ఏర్పాటైన ఈ స్కిల్ హబ్‌లో శిక్షణ కార్యక్రమాన్ని నిరుద్యోగులైన విద్యావంతులు సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని ఆయన సూచించారు.

కుమారస్వామికి విశేష పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఈఓ,అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో గురువారం షష్టిని పురస్కరించుకుని ఈఓఎస్‌లవన్న, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి వారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.